జర్నలిస్ట్ వార్త
RNI NO :Title-Code :-TELTEL02102
తెలుగు దినపత్రిక
అనుక్షణం ప్రజలపక్షం...

WANTED
రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
దిన పత్రికలో పనిచేయుటకు
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని
అన్ని జిల్లా, మండల, కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను.
ఎడిటర్ : బిర్రు కరుణాకర్
Cell: 9701249103

ప్రచురణ : హైదరాబాద్, శనివారం 6 -1 -2024 సంపుటి :01 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ సంచిక : 111 పేజీలు : 4 వెల : 5-00



3 లో

## 'ఫొటో సెషన్‌కు సమయం ఉంది..

- మణిపూర్ పరిస్థితి ఏంటి?'



3 లో

## సముద్రంలో కూలిన విమానం, కూతుళ్లతో పాటు హాలీవుడ్ నటుడు మృతి



3 లో

## మాతృభాష కోసం నా ప్రాణాలను ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాను..



# మూడు క్లస్టర్లుగా తెలంగాణ

- పారిశ్రామిక అభివృద్ధికి మెగా మాస్టర్ ప్లాన్-2050
- రాష్ట్రమంతా పారిశ్రామిక అభివృది
- ఫార్మాసిటీలా కొత్తగా ఫార్మా విలేజీలు
- సోలార్ పవర్ పాలసీకి రూపకల్పన
- యువత కోసం స్కిల్ యూనివర్సిటీ
- సీఐఐ ప్రతినిధులతో సీఎం రేవంత్

హైదరాబాద్, జనవరి 6 జర్నలిస్ట్ వార్త

తెలంగాణను మూడు క్లస్టర్లుగా విభజించబోతున్నట్టు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. ఔటర్ రింగ్‌రోడ్డు (ఓఆర్ఆర్) లోపలి ప్రాంతాన్ని అర్బన్ క్లస్టర్‌గా, ఆ తర్వాత రీజినల్ రింగ్‌రోడ్డు వరకు మధ్యలో ఉన్న ప్రాంతాన్ని సెమీ అర్బన్ క్లస్టర్‌గా, రీజనల్ రింగ్‌రోడ్డు తర్వాత చుట్టూ ఉన్న ప్రాంతాన్ని రూరల్ క్లస్టర్‌గా విభజిస్తామని తెలిపారు. పారిశ్రామికంగా అన్ని రంగాలు అభివృద్ధి చెందేలా ఫ్రెండ్లీ పాలసీని అమలు చేసేందుకు ఔత్సాహికులు, పారిశ్రామికవేత్తలు సహకరించాలని కోరారు. శనివారం సచివాలయంలో భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) ప్రతినిధులతో సీఎం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశ్రమల అభివృద్ధికి, పెట్టుబడులను ఆహ్వానించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సరికొత్త ఫ్రెండ్లీ పాలసీని అనుసరిస్తుందని పేర్కొన్నారు. వచ్చే పాతికేళ్లనాటికి నాటికి తెలంగాణ అంతటా పారిశ్రామికవృద్ధి జరగాలనే భవిష్యత్తు లక్ష్యంతో మెగా మాస్టర్ ప్లాన్-2050కి రూపకల్పన చేస్తామని చెప్పారు. రాష్ట్రంలో 1994 నుంచి 2004 వరకు పరిశ్రమల అభివృద్ధికి అనుసరించిన ఫార్ములా ఒకలా ఉంటే, 2004 నుంచి 2014 వరకు అది మరో మెట్టుకు చేరుకుందని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో ఇది అత్యున్నత వృద్ధి దశకు చేరుకోవాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తుందని చెప్పారు. తెలంగాణలోని అన్ని ప్రాంతా లు హైదరాబాద్ తరహాలోనే అభివృద్ధి చెందాలన్నదే తన లక్ష్యమని పేర్కొన్నారు.

### ఫార్మాసిటీ కాదు.. ఫార్మా విలేజీలు

ఫార్మాసిటీ విషయంలో ప్రభుత్వానికి స్పష్టమైన ఆలోచనలు ఉన్నాయని రేవంత్ తెలిపారు. ఫార్మాసిటీగా కాకుండా ఫార్మా విలేజీలను అభివృద్ధి చేస్తామని వివరించారు. ఓఆర్ఆర్‌పై 14 రేడియల్ రోడ్లు ఉన్నాయని, వీటికి 12 జాతీయ రహదారుల కనెక్టివిటీ ఉందని, వీటికి అందుబాటులో ఉండేలా దాదాపు వెయ్యి నుంచి 3 వేల ఎకరాలకో ఫార్మా విలేజీని అభివృద్ధి చేస్తామని తెలిపారు.

### సోలార్ పవర్ పాలసీ

జహీరాబాద్‌లో ఐటీ, ఫార్మా, హెల్త్‌తోపాటు ఫుడ్ ప్రాసెసింగ్, స్పోర్ట్స్, ఆటోమొబైల్, ఆర్గానిక్ క్లస్టర్లుగా అకడ పరిశ్రమల ఏర్పాటు జరగాలని సీఎం ఆకాక్షించారు. రక్షణరంగం, నావికారంగానికి అవసరమైన పరికరాల తయారీ, ఉత్పత్తికి హైదరాబాద్‌లో అపారమైన అవకాశాలున్నాయని, పారిశ్రామికవేత్తలు వీటిపై దృష్టి కేంద్రీకరించాలని సూచించారు. కొత్తగా సోలార్ పవర్ పాలసీ రూపొందిస్తామని, సోలార్ ఎనర్జీ పరిశ్రమలకు తగిన ప్రోత్సాహకాలు అందిస్తామని సీఎం తెలిపారు.

# త్వరలోనే కేసీఆర్ జిల్లాల పర్యటన

- ఫిబ్రవరిలో ప్రజల్లోకి కేసీఆర్
- వచ్చే నెలనుంచి తెలంగాణ భవన్‌లో ప్రతి కార్యకర్తనూ కలుస్తారు
- గులాబీ కార్యకర్తలకు అండగా ఉంటాం
- కాంగ్రెస్ కక్షసాధింపు ఎదుర్కొంటాం
- ఎవరూ అధైర్యపడాల్సిన పనిలేదు
- పార్టీ సంస్థాగత నిర్మాణం చేస్తాం
- మాజీ మంత్రి హరీశ్‌రావు వెల్లడి

హైదరాబాద్, జనవరి 6 జర్నలిస్ట్ వార్త



బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ కోలుకుంటు న్నారని, త్వరలోనే సంపూర్ణ ఆరోగ్యవంతుడై ప్రజల మధ్యలోకి వస్తారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు వెల్లడిం చారు. ఫిబ్రవరిలో తెలం గాణ భవన్‌కు వచ్చి ప్రతీరోజూ పార్టీ కార్యకర్తలను కలుస్తారని తెలిపారు. త్వరలోనే కేసీఆర్ జిల్లాల పర్యటనలు ఉంటాయని పేర్కొన్నారు. శనివారం తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ పార్టీ పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ సన్నాహక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మాజీ మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ కేసీఆర్ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా అమలు చేసిన పథకాలను రద్దు చేసినంత మాత్రాన, పేర్లు మార్చినంత మాత్రాన బీఆర్ఎస్ పార్టీ సంక్షేమ పాలన కాదనలేనిదని అన్నారు. కిట్ మీద కేసీఆర్ గుర్తును కాంగ్రెస్ ప్రభుత్వం చెరిపేస్తుందని, కేసీఆర్ గుర్తును కేసీఆర్ కిట్ నుంచి తొలిగిస్తారేమో కానీ తెలంగాణ ప్రజల గుండెల నుంచి తొలగించలేరని స్పష్టం చేశారు. కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను రద్దు చేయడాన్ని ఆయన తప్పుబట్టారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన రద్దు.. వాయిదాలు అన్నట్టుగా సాగుతున్నదని ఎద్దేవా చేశారు.

## నమాజ్‌లోనే ప్రాణాలు విడిచిన మస్జిద్ ఇమామ్..



2 లో

# ఎస్మా ప్రయోగం దారుణం: లోకేశ్



అమరావతి,జనవరి6:జర్నలిస్ట్ వార్త

తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ గత 26 రోజులుగా ఆందోళన చేస్తున్న అంగన్వాడీలపై ఎస్మా చట్టాన్ని ప్రయోగించడంపై టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఆయన తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. జీవో నెం.2ను తక్షణమే ఉపసంహరించుకోవాలని.. అంగన్వాడీల ఉద్యమానికి టిడిపి పూర్తి మద్దతిస్తుందని చెప్పారు. అమ్మనే గెంటేసిన వ్యక్తికి
అంగన్వాడీల విలువ ఏం తెలుసని విమర్శించారు. ఇచ్చిన హామీలను అమలు చేయాలని నిరసన చేయడం కూడా నేరమేనా? అని ప్రశ్నించారు. జగన్ అహంకారానికి, అంగన్వాడీల ఆత్మగౌరవానికి మధ్య జరుగుతున్న ఈ యుద్ధంలో అంతిమంగా ఉద్యోగులే విజయం సాధిస్తారని అన్నారు.

# పారిశ్రామిక వృద్ధికి మెగా మాస్టర్ పాలసీ

అంకురం 2050 జర్నలిస్ట్ వార్త

నాటికి తెలంగాణ అంతటా పారిశ్రామిక వృద్ధి జరగాలనే భవిష్యత్తు లక్ష్యంతో మెగా మాస్టర్ పాలసీ రూపకల్పన చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. సెక్రటేరియల్‌లో భారత పారిశ్రామిక సమాఖ్య (సీఐఐ) ప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. తెలంగాణ ప్రాంతంలో 1994 నుంచి 2004 వరకు పరిశ్రమల అభివృద్ధికి అనుసరించిన ఫార్ములా ఒక తీరుగా ఉంటే.. 2004 నుంచి 2014 వరకు అది మరో మెట్టుకు చేరుకుందని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో ఇది అత్యున్నత వృద్ధి దశకు చేరుకోవాలనే లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తుందన్నారు. పరిశ్రమల అభివృద్ధికి.. పెట్టుబడులను ఆహ్వానించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సరికొత్త ఫ్రెండీ పాలసీని అనుసరిస్తుందని చెప్పారు. పారిశ్రామిక అభివృద్ధి విషయంలో అపోహలు, అనుమానాలకు తావు లేదని అన్నారు. పారిశ్రామికవేత్తలు తెలంగాణలో పెట్టే ప్రతి పైసా పెట్టుబడికి రక్షణ కల్పిస్తామని, అంతకంతకు విలువ కూడా ఉంటుందని సీఎం భరోసా ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామీణ ప్రజల సంక్షేమం, గ్రామీణ ప్రాంతాల ప్రయోజనాలకే పెద్దపీట వేస్తుందనే ఆలోచనలకు భిన్నంగా కొత్త పాలసీని ప్రభుత్వం అనుసరిస్తుందని స్పష్టం చేశారు. హైదరాబాద్ ఒక్కచోటే పారిశ్రామిక అభివృద్ధి కేంద్రీకృతం కాకుండా.. తెలంగాణలోని అన్ని ప్రాంతాలు హైదరాబాద్ తరహాలోనే అభివృద్ధి చెందాలనే ఆకాంక్షను వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాలకు



పరిశ్రమలు విస్తరించాలనేది తమ లక్ష్యమని తెలిపారు. నగరాలు, పట్టణాల్లో అభివృద్ధి ఫలాలు, పెట్టుబడులతోనే గ్రామాలు, గ్రామీణ ప్రాంతాల సౌభాగ్యం, సంక్షేమం ముడిపడి ఉంటుందని అన్నారు. పారిశ్రామికంగా అన్ని రంగాలు అభివృద్ధి చెందేలా ఫ్రెండ్లీ పాలసీని అమలు చేసేందుకు ఔత్సాహికులు, పారిశ్రామికవేత్తలు సహకరించాలని ముఖ్యమంత్రి కోరారు. ఈ పాలసీలో భాగంగా తెలంగాణను మూడు క్లస్టర్లుగా విభజించనున్నట్లు తెలిపారు. హైదరాబాద్ అవుటర్ రింగ్ రోడ్డు (%వా==%) లోపల అర్బన్ క్లస్టర్, ఓఆర్ఆర్ తర్వాత రీజనల్ రింగ్ రోడ్డు వరకు మధ్యలో ఉన్న ప్రాంతం సెమీ అర్బన్ క్లస్టర్‌గా, రీజనల్ రింగ్ రోడ్డు తర్వాత చుట్టూరా ఉన్న ప్రాంతాన్ని రూరల్ క్లస్టర్‌గా గుర్తించి పరిశ్రమల స్థాపనకు ప్రోత్సాహం అందిస్తామన్నారు. ఫార్మాసిటీ విషయంలో ప్రభుత్వానికి స్పష్టమైన ఆలోచనలు ఉన్నాయని తెలిపారు.

## న్యాయం జరిగే వరకు

# రాహుల్ యాత్ర

- 14 నుంచి 66 రోజుల పాటు న్యాయ్ యాత్ర
- భారత్ జోడో న్యాయ్ యాత్ర లోగో విడుదల
- ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే



న్యూఢిల్లీజర్నలిస్ట్ వార్త జనవరి6అంకురంకాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఈ నెల 14న ప్రారంభించనున్న 'భారత్ జోడో న్యాయ్ యాత్ర లోగోను ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఖర్గే మాట్లాడుతూ.. ఈ యాత్ర 'న్యాయం జరిగే వరకు' అన్నారు. పార్లమెంట్‌లో సమస్యలు లేవనెత్తేందుకు ప్రభుత్వం అనుమతించట్లేదని, అందుకే తాము ఈ న్యాయ యాత్ర చేపడుతున్నట్లు తెలిపారు. మణిపుర్‌లో ఇటీవల ఎన్నో దురదృష్టకర ఘటనలు చోటుచేసుకు న్నాయన్నారు. వాటిపై ప్రధాని మోదీ అనేక చోట్ల ప్రసంగాలిచ్చారు కానీ.. ఆ రాష్ట్రానికి మాత్రం వెళ్లలేదన్నారు. దీనిపై మాట్లాడేందుకు మాకు అవకాశం ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దేశ చరిత్రలోనే తొలిసారి 146 మంది ఎంపీలను సస్పెండ్ చేశారని, అందుకే తమ గళాన్ని వినిపించేందుకు ప్రజల్లోకి వెళ్తున్నామని చెప్పారు.

# గతంలో చేపట్టిన పథకాలు కొనసాగించాలి

ఇచ్చిన హామీలతో పాటు రైతు సంక్షేమం సాగాలి
కాంగ్రెస్ ప్రభుత్వానికి మాజీమంత్రి వేమల సూచన

నిజామాబాద్,జనవరి6 ఎన్నికల హామీలో లేని అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి, అందించిన ఘనత బిఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందని మాజీమంత్రి, బిఆర్ఎస్ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. సమైక్య రాష్ట్రంలో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారని అందుకే వ్యవసాయానికి కెసిఆ÷- పెద్దపీట వేశారని అన్నాడు. రైతాంగానికి 24గంటల ఉచిత కరంటు అందించడం చారిత్రాత్మక నిర్ణయమన్నారు. దీనిని కొనసాగించి మరింత పక్కాగా ముందుకు తీసుకుని వెళ్లాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందని నిరూపించేలా 24గంటల ఉచిత విద్యుత్‌ను ఇకముందు కూడా అందించాలని అన్నారు. రైతులను కదిలిస్తే కెసిఆర్ ప్రభుత్వ చిత్తశుద్ది తెలిసి వస్తుందని అన్నారు. 24 గంటల కరెంట్, రైతుబంధు బిజెపి పాలిత రాష్ట్రాల్లో ఎందుకు ఇవ్వలేకపోతు న్నారని ప్రశ్నించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీమేరకు రైతాంగానికి 24గంటల ఉచిత కరంటు అందించి, ఆదుకున్న ఘనత నాటి సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. రైతుల కళ్లలో వెలుగులు చూడాలన్న లక్ష్యంతో కేసీఆర్ పనిచేశారని అన్నారు. తెలంగాణ ఏర్పడితే కరంటు కష్టాలు తప్పవన్న ఆంధ్ర పాలకుల విమర్శలకు దీటుగా 24గంటల ఉచిత కరంటు ఇచ్చామన్నారు. రైతాంగానికి కరంటు సమస్య తలెత్తకుండా సబ్‌స్టేషన్లు పటిష్టం చేశామని వెల్లడించారు. మరిన్ని నూతన సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు కూడా ప్రాతిపాదనలు పంపినట్లు చెప్పారు. పారిశ్రామిక, విద్య, వైద్యం వంటి అన్నిరంగాల అభివృద్ధికి ప్రణాళికలతో ముందుకు వెళ్లామని వేముల అన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయడంతో పాటు, తాము అమలు చేసిన రైతు సంఓేమ విధానాలు కొనసాగించాలన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధిపై కాంగ్రెస్ నేతలు చేస్తున్న విమర్శలను ఆయన ఖండించారు. కెసిఆర్ ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన రైతుబంధు,రైతుబీమా, నిరంతర విద్యుత్ పథకాలతో తెలంగాణలో రైతులకు తిరుగులేకుండా పోయిందని అన్నారు. రైతు సంక్షేమానికి కేసీఆర్ అధిక నిధులు వెచ్చించారని అన్నారు. గతంలో ఇలా కార్యక్రమాలు జరిగిన దాఖలాలు లేవన్నారు. మిషన్ భగీరథ పథకం ద్వారా ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు అందించింది నిజం కాదా అని తెలిపారు. సబ్బండ కులాల సంక్షేమమే ధ్యేయంగా కేసీఆర్ సంక్షేమ పథకాలు అమలు చేశారని వేముల అన్నారు. గొల్ల కుర్మలు ఆర్థికంగా ఎదుగాలన్న సంకల్పంతో సబ్సిడీపై గొర్రెలు, ఏడాది పాటు ఉచిత దాణాను అందిస్తూ వచ్చామని అన్నారు. గీత కార్మికులు, మత్స్య కార్మికులు, చేనేత కార్మికులకు రూ.5 లక్షల ప్రమాద బీమా కల్పించామన్నారు. ఈ సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను కాంగ్రెస్ ప్రభుత్వం కూడా కొనసాగించాలని అన్నారు. దేశంలోనే తొలిసారిగా తెలంగాణలో మాత్రమే రైతు సంక్షేమ కార్యక్రమాలు అమలయ్యాని ఎమ్మెల్యే అన్నారు. రైతుబంధు అన్నది కేవలం తెలంగాణలో మాత్రమే అందుతున్న కార్యక్రమమని అన్నారు. దాదాపు 50వేల కోట్లు అందచేస్తున్న ఘనత కెసిఆర్‌దని అన్నారు. రైతుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం నిరంతర విద్యుత్ సరఫరాతో పాటు రైతులకు సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు, ట్రాక్టర్లు, వ్యవసాయ పెట్టుబడి కొరకు ఎకరాకు రూ.పది వేల సహాయం, మిషన్ కాకతీయ ద్వారా సాగునీరు అందించిన ఘనత టీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందని అన్నారు. ప్రమాద బీమా సదుపాయం ద్వారా ఐదు లక్షల నగదు మృతుడి కుటుంబానికి అందించామని అన్నారు. సంక్షేమ పథకాలను ప్రజలకు పారదర్శకంగా అందించడమే లక్ష్యంగా టీఆర్ఎస్ ప్రభుత్వం పని చేసిందని అన్నారు. అధికాం చేపట్టిన కాంగ్రెస్ పా÷-టీకి ఇవన్నీ కనిపించడం లేదా అని అన్నారు.

# గ్రామస్థాయి ప్రణాళికలతో సాగాలి !

**నినాదాలు కాకుండా విధానాలు పటిష్టం చేయాలి - గ్రామీణ అర్థిక వ్యవస్థ బలోపేతంతోనే సమస్యలకు చెక్**

న్యూఢిల్లీ,జనవరి6:మన విధానాలు మారాలి. ప్రణాళికలు మారాలి. ప్రజలు ఎప్పుడూ దరఖాస్తులతో ప్రభుత్వం దగ్గరకు రాకుండా నిరంతరాయంగా ఆజాదీకా అమృత్ మహోత్సవ్.. అన్న నినాదాలు తప్ప గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బాగుచేసే కార్యక్రమాలు అమలు కావడం లేదు. నేలవిడిచి సాము చేసే పథకాలతో దేశం ఆర్థికంగా కుంగిపోతోంది. క్షేత్రస్థాయిలో ఏం జరుగుతుందో తెలుసుకుని.. సమీక్షించే తీరిక పాలకులకు ఉండడం లేదు. దేశం బలపడాలంటే గ్రామాలు బలపడాలి. గ్రామాలు ఆర్థికంగా వృద్ది చెందాలి. వ్యవసాయం బలపడాలి. అన్నదాతలు ఆర్థికంగా బలపడితేనే అనుబంధ రంగాలు పెరుగుతాయి. అయితే వ్యవసాయికంగా మనం పంటల ఉత్పత్తిలో చూపిస్తున్న శ్రద్ద వ్యవసాయ అనుబంధ రంగాల అభివృద్ధికి చర్యలు తీసుకోవడం లేదు. దీంతో అన్ని విధాలుగా మనమంతా అభివృద్ధికి నోచుకోవడం లేదు. ఈ ఒక్క సూత్రాన్ని పాటిస్తే పంట ఉత్పత్తులతో పాటు..నిరుద్యోగ సమస్యకు చెక్ పెట్టడమే గాకుండా...గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి దోహదపడగలం. గ్రామస్థాయిలో ప్రణాళికలు రచించి అమలయ్యేలా కార్యాచరణ సాగడం లేదు.గ్రామీణ అర్థిక వ్యవస్థకు పట్టుగొమ్మగా సర్పంచ్‌ను బాధ్యులను చేసేలా కార్యక్రమాల అమలు జరగడం లేదు. గ్రామాల్లో సర్పంచ్‌లు పటిష్టంగా పనిచేయడం తో పాటు ప్రణాళికలు సిద్ధం చేసేలా అధికారులు కార్యాచరణ సిద్ధం చేయాలి. అప్పుడే ఆశించిన లక్ష్యం నెరవేరుతుంది. అందుకు అనుగుణంగా కార్యాచరణ ఉండాలి. సర్పంచ్ లను, గ్రామ వార్డు సభ్యులను బాధ్యులను చేయాలి. అప్పుడే ఏ పథకం అయినా ఆశించన ఫలితం అందిస్తుంది. గ్రామాలకు నేరుగా నిధులు విడుదల చేస్తున్నా అవి వారికి చేరడం లేదు. ఆర్థికంగా పంచాయితీలు బలోపేతంగా లేకపోవడంతో పాటు, సర్పంచ్‌లు కూడా బాధ్యతారహితంగా వ్యవహరించడం వల్ల గ్రామాల్లో పారిశుద్య కార్యక్రమాలు మొదలు ఇతరత్రా కార్యక్రామలు బలంగా ముందుకు సాగడం లేదు. ప్రధానంగా పారిశుధ్యం అన్నది పంచాయితీల సామాజిక బాధ్యతగా చేయాలి. స్వచ్ఛత అన్నది వ్యక్తిగత మైన శ్రద్దకు సంబంధించి నదే అయినా ఇతర దేశాలతో పోలిస్తే భారత్‌లో ఇలాంటి శ్రద్ద తక్కువనే చెప్పాలి. ఇప్పటికీ ఆరుబయట మల విసర్జన అన్నది అలవాటుగా కొనసాగుతోంది. నిత్యం టీవీల్లో పేపర్లలో ప్రకటనల ద్వారా ప్రజల్లో చైతన్యానికి కృషి చేస్తున్నా వ్యక్తిగత మరుగదొడ్ల నిర్మాణాలు పూర్తి కావడం లేదు. కరోనా లాంటి వైరస్‌లు విజృంభించి అనారోగ్యాల బారిన పడుతున్నా ..ఇందుకు అపరిశుభ్రతే కారణమని ప్రజలు గ్రహించడం లేదు. గ్రామాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు గుట్టలుగా పేరుకుపోతున్నాయి. మురుగు నీరు ఎక్కడపడితే అక్కడ వచ్చి చేరుతోంది. నిజానికి కార్యక్రమాల్లో ఏ గ్రామానికి ఆగ్రామ సర్పంచ్‌ను బాధ్యుడిని చేస్తే సరిపోయేది. ఆరుబయట మలవిసర్జన కారణంగా మనదేశంలో అనారోగ్యకర వాతావారణం ఎక్కువే. అలాగే వ్యాధుల సంక్రమణ, అంటువ్యాధుల వ్యాప్తి కూడా ఎక్కువే. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యల కారణంగా గ్రామాల్లో జోరుగా దీనిపై శ్రద్ద పెడుతున్నా లక్ష్యాన్ని మాత్రం సాధించడం లేదు. పారిశుద్యం, వీధులు శుభ్రంగా ఉంచుకోవడం, చెత్తా చెదారం ఎక్కడపడితే అక్కడ వేయడం, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించడం తదితర అంశాలు సామాజిక బాధ్యత కావాలి.

# ఎస్మాకు భయపడేది లేదు

మరో నెలయితే మీరే ఉండరు- అంగన్‌వాడీల విస్పష్ట ప్రకటన

విజయవాడ,జనవరి6:అంగన్వాడీల సమ్మెపై ఏపీ ప్రభుత్వం ఎస్మా ప్రయోగిస్తూ జీవో జారీ చేసింది. ప్రభుత్వం ఎస్మా ప్రయోగించడాన్ని అంగన్వాడీలు తీవ్రంగా ఖండించారు. అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నేతలు మాట్లాడుతూ.. 26 రోజులుగా సమ్మె చేస్తున్నామని.. ప్రభుత్వానికి తాము గుర్తు రాలేదా అని ప్రశ్నించారు. ప్రభుత్వం ప్రయోగించిన ఎస్మాకు భయపడేది లేదని స్పష్టం చేశారు. తాము వేతనాలు, హక్కుల కోసం పోరాడుతున్నామన్నారు. అంగన్వాడీలకు అత్యవసర సర్వీసులు వర్తించవన్నారు. ఫౌష్టికాహారం గర్భిణీలకు ఎంత అవసరమో అంగన్వాడీలకు అంతే అవసరమన్నారు.
ఆరు నెలల పాటు నిరసనలు, ధర్నాలు చేయవద్దని చెప్పడానికి మీరు ఆరు నెలలు ప్రభుత్వంలో ఉండాలి కదా. మాకు ఆరునెలల సమయం.. మహా అయితే నెల రోజుల పాటు మీరు అధికారంలో ఉంటారు. మీ ఎస్మాలకు భయపడేది లేదు.. మా సమ్మె ఆగదు... అవసరమైతే లీగల్‌గానే ఎదుర్కొంటాం. ప్రభుత్వం చర్చలకి పిలవాలి.. మా వేతనాల సమస్యలను పరిష్కరించాలని లేకుంటే సమ్మెను మరింత ఉధృతం చేస్తాం. రేపు రాష్ట్ర వ్యాప్తంగా జీవో కాపీలను దగ్ధం చేసి నిరసన తెలుపుతాం అని యూనియన్ నేతలు స్పష్టం చేశారు.


# ఎస్మా ప్రయోగం దారుణం

వెంటనే చర్చలు చేసి పరిష్కరించాలి
సిపిఎం కార్యదర్శి శ్రీనివాసరావు డిమాండ్

విజయవాడ,జనవరి6:అంగన్‌వాడీల సమ్మెపై ఎస్మాను ప్రయోగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జి.వో.నెం-2 జారీ చేయడాన్ని సిపిఐ(యం) రాష్ట్ర కమిటి తీవ్రంగా ఖండించింది. తక్షణమే జివో ను ఉపసంహరించి, వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు పత్రికా ప్రకటన విడుదల చేశారు. 26 రోజులుగా శాంతియుతంగా జరుగుతున్న అంగన్‌వాడీలను ఎస్మా చట్టపరిధిలోకి తీసుకువచ్చి సమ్మెను నిషేదించడం అప్రజాస్వామికమని ఆయన పేర్కొన్నారు. సమస్యలు పరిష్కరించకుండా సమ్మె నిషేదిస్తూ, సమ్మె కాలానికి జీతాల్లో కోత విధించడం దుర్మార్గమన్నారు. న్యాయబద్ధమైన సమ్మెను నిరంకుశ చర్యల ద్వారా విచ్ఛిన్నం చేయాలనుకోవడం అభ్యంతరకరమైనదని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మోడీ కేంద్ర ప్రభుత్వ అడుగుజాడల్లో ఉద్యమాన్ని అణిచివేయాలని చూస్తున్నదని ఆగ్రహించారు. ఇదే వైఖరి కొనసాగితే జరిగే పరిణామాలకు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వ ఈ నిరంకుశ చర్యను కార్మిక సంఘాలు, ప్రజా సంఘాలు, పార్టీలు, ప్రజాతంత్ర వాదులు ఖండించవలసిందిగా సిపిఐ(యం) విజ్ఞప్తి చేసింది. సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలకు అండగా నిలబడవలసిందిగా ప్రజలకు సిపిఐ(యం) విజ్ఞప్తి చేసింది.

# ‘ఫొటో సెషన్‌కు సమయం ఉంది..

**- మణిపూర్ పరిస్థితి ఏంటీ?’**



న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్రమోదీకి ఫొటోలు దిగడానికి ఉ?న్న సమయం.. హింస చెలరేగిన మణిపూర్‌లో పర్యటించడానికి లేదుని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే దుయ్యబట్టారు.శనివారం ఖర్గే ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఇటీవల ప్రధానిమోదీ లక్షద్వీప్ పర్యటనపై ఖర్గే విమర్శలు గుప్పించారు.ఒకవైపు మణిపూర్‌లో దురదృష్టవశాత్తు రెండు వర్గాల మధ్య హింస చెలరేగితే, మరోవైపు ప్రధాని మోదీ మాత్రం బీచ్‌లో సాహస క్రీడ ఆడుతూ.. ఫొటో సెషన్ నిర్వహిస్తున్నారని మండిపడ్డారు. ఎక్కడికి వెళ్లినా ముందు ఫొటోలకు పోజులు ఇస్తారని ఎద్దేవా చేశారు. ముందు దేవుడి దర్శనంలా ఎక్కడికి వెళ్లినా ప్రధాని మోదీ ఫొటోలే కనిపిస్తాయని మండిపడ్డారు. ఇటువంటి పెద్దమనిషి.. ఎందుకు మణిపూర్‌కు వెళ్లడం లేదు? అని సూటిగా ప్రశ్నించారు.ఖర్గే వ్యాఖ్యలను బీజేపీ కేంద్ర మంతి గిరిరాజ్ సింగ్ ఖండించారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలను గందరగోళానికి గురిచేస్తోందని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీవాళ్లు మణిపూర్‌కు కేవలం రాజకీయ విహారయాత్రకు మాత్రమే వెళ్లారని అన్నారు. ప్రధాన మంత్రి మోదీ, హెూంశాఖ మంత్రి అమిత్ షా.. మణిపూర్‌లో సమస్యల పరిష్కారానికి కృషి? చేస్తున్నారని తెలిపారు.

# నమాజ్‌లోనే ప్రాణాలు విడిచిన మస్జిద్ ఇమామ్..

– కన్నీళ్లు తెప్పిస్తున్న వీడియో
-నమాజ్‌లోనే ప్రాణాలు విడిచిన మస్జిద్ ఇమామ్.. కన్నీళ్లు తెప్పిస్తున్న వీడియో



నమాజ్ స్థితిలో ఉండగానే ఆకస్మికంగా మృతిచెందిన మస్జిదు ఇమామ్ వీడియో ఒకటి కన్నీళ్లు తెప్పిస్తోంది. ఇండోనేషియా మస్జిదులో జరిగిన ఈ ఘటన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.ఫజర్ నమాజు చేయిస్తున్న మస్జిద్ ఇమామ్ సజ్దాలోకి వెళ్లి తిరిగి లేవలేదు. నిర్జీవంగా పడిపోయారు. విషయాన్ని గమనించిన వెనుకున్నవారు ఆందోళన చెందలేదు. వెనుక నిల్చున్న మరో వ్యక్తి ముందుకొచ్చి నమాజు చేయించారు.నమాజును మాత్రం అర్ధాంతరంగా ముగించలేదు. ముస్లిములు నమాజును ప్రాణానికి మిన్నగా ప్రేమిస్తారని ఈ ఘటన రుజువుచేస్తుంది. ఇస్లామ్ చరిత్రలో ఇలాంటి ఘటనలు చాలానే జరిగాయి. ఖలీఫా హజ్రత్ ఉమర్ నమాజు చేయిస్తుండగా ఆయనపై ఖడ్గంతో దాడి జరిపారు. ఆయన నమాజ్ స్థితిలోనే కుప్పకూలిపోయారు. వెనుకున్న వారెవరూ భయభ్రాంతులకు గురవ్వలేదు. ఉమర్ వెనుక నిల్చుని ఉన్న అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ ముందుకొచ్చి మిగతా నమాజును పూర్తిచేసిన పిదప జరిగిన దాడిని గురించి ఆరాతీశారు.

# నేను కాలారామ్ దేవాలయంలో హారతి ఇస్తా: ఉద్ధవ్



అయోధ్య రామ మందిర ప్రాణ ప్రతిష్ఠకు ఏర్పాట్లు శరవేగంగా సాగుతున్నాయి. జనవరి 22న జరిగే ఈ మహత్తర కార్యక్రమానికి హాజరు కావల్సిందిగా శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్..దేశవ్యాప్తంగా ప్రముఖులకు ఆహ్వానాలు పంపుతోంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ సహా 6,000 మందికి పైగా ఈ కార్యక్రమానికి హాజరయ్యే అవకాశం ఉంది. అయితే చాలా మంది నేతలకు ఆహ్వానం అందలేదు. వీరిలో శివసేన (యూబీటీ) అధినేత ఉద్ధవ్ ఠాక్రే కూడా ఒకరు.తనకు ఇంకా ఎలాంటి ఆహ్వానం అందలేదని ఠాక్రే ఇప్పటికే వెల్లడించిన విషయం తెలిసిందే. తాజాగా ఉద్ధవ్ తన తల్లి జయంతి సందర్భంగా ఆమెకు నివాళులు అర్పించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. రామమందిర ఆలయం ప్రారంభోత్సవం రోజే తనతోపాటు తన పార్టీ నేతలు నాసిక్‌లోని కాలారామ్ ఆలయానికి వెళ్లి అక్కడ గోదావరి నది ఒడ్డున మహా హారతి నిర్వహించనున్నట్లు చెప్పారు. తనకు శ్రీరాముని దర్శనం కావాలని అనిపిస్తే అయోధ్యను సందర్శిస్తానని పేర్కొన్నారు.అయోధ్య రామ మందిర నిర్మాణం, విగ్రహ ప్రతిష్టాపన గర్వించదగ్గ విషయమని, ఆత్మగౌరవానికి సంబంధించినదని తెలిపారు.
ఆ రోజు (జనవరి 22) సాయంత్రం 6.30 గంటలకు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్, సానే గురూజీ నిరసనలు చేసిన కాలారామ్ సదర్శించి గోదావరి నది ఒడ్డున మహా హారతి నిర్వహిస్తాం” అని ఠాక్రే చెప్పారు. కాగా రామజన్మభూమి ఉద్యమం కోసం ‘శివసేన’ సుదీర్ఘ పోరాటం చేసిందని గతవారం ఉద్ధవ్ తెలిపిన విషయం తెలిసిందే.

# అంగన్‌వాడీల సమ్మెపై ఉక్కుపాదం

ఎస్మా ప్రయోగిస్తూ ఉత్తర్వులు జారీ
ఆరు నెలలపాటు సమ్మె నిషేధిస్తూ ఆదేశాలు

అమరావతి,జనవరి6 సుమారు నెల రోజులుగా సమ్మె చేస్తున్న అంగన్‌వాడీల ఉద్యమంపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపింది. వారిపై ఎస్మా ప్రయోగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఆరునెలల పాటు ఎలాంటి సమ్మెలు, ఆందోళనలు చేయొద్దని ఆదేశాల్లో పేర్కొంది. సమస్యల పరిష్కారం కోసం గత 26 రోజులుగా సమ్మె చేస్తున్న అంగన్వాడీలపై జగన్ సర్కార్ ఉక్కుపాదం మోపింది. అంగన్వాడీల సమ్మెపై సర్కార్ ఎస్మా అస్త్రాన్ని ప్రయోగించింది. అంగన్వాడీల సమ్మెను నిషేధిస్తూ శనివారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వారిని అత్యవసర సర్వీసు కిందకు తీసుకొస్తూ జీవో జారీ చేసింది. ఆరు నెలలు పాటు సమ్మె నిషేధం విధిస్తూ నిర్ణయం తీసుకుంది. అంగన్వాడీల సేవలు అత్యవసర సర్వీసులు కిందకు రానప్పటికీ... వారిని అత్యవసర సర్వీసుల కిందకు ప్రభుత్వం తీసుకువచ్చింది.

ఈ మేరకు జీవో నంబర్ 2ను ఏపీ ప్రభుత్వం విడుదల చేసింది. 2013 జాతీయ ఆహార భద్రత చట్టంలోని సెక్షన్ 39 కింద అంగన్వాడీలు అత్యవసర సర్వీసులు కిందకు వస్తారని సర్కార్ పేర్కొంది. 1971 అత్యవసర సేవల నిర్వహణ చట్టం కింద సమ్మెను నిషేధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ ఆదేశాలను ఉల్లంఘించి సమ్మెను కొనసాగిస్తే అంగన్వాడీలను డిస్మిస్ చేసే అధికారం ప్రభుత్వానికి ఉంటుంది. సమ్మెలో ఉన్నవారిపై ప్రాసిక్యూషన్‌కు అవకాశం ఉంటుంది. సమ్మె చేసిన వారికి ఆరు నెలలు జైలు శిక్ష, సహకరించిన వారికి ఏడాది జైలు శిక్ష విధించే అవకాశం ఉంది.

గత కొన్ని రోజులుగా అంగన్వాడీలతో ప్రభుత్వం పలు దఫాలుగా చర్చలు జరపింది. పలు డిమాండ్లకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అయితే అన్ని డిమాండ్ పరిష్కారం వరకు సమ్మె ఆపేది లేదని అంగన్వాడీలు స్పష్టం చేశారు. జీతాల పెంపు, గ్రాట్యుటీపై పట్టుబడుతూ అంగన్వాడీలు సమ్మెను కొనసాగిస్తున్నారు. జీతాల పెంపు, గ్రాట్యుటీ పెంపుతోపాటు ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ 26 రోజులుగా అంగన్‌వాడీలు సమ్మె చేస్తున్నారు. వారితో దఫదఫాలుగా చర్చలు జరిపిన ప్రభుత్వం వారి డిమాండ్లపై క్లారిటీ ఇవ్వలేకపోయింది. ఆర్థికంగా ప్రభావం పడని వాటికి ఓకే చెప్పింది కానీ జీతాల పెంపుపై వారికిహామీ ఇవ్వలేదు. అందుకే అంగన్‌వాడీ వర్కర్లు సమ్మె విరమించడం లేదు.
ప్రభుత్వం చర్చలు జరిపినా, బెదిరించినా సమ్మె విరమించడం లేదని ఇప్పుడు అంగన్‌వాడీల సేవలను అత్యవసర సర్వీసు కిందకు తీసుకొస్తూ జీవో రిలీజ్ చేసింది. అంతే కాకుండా ఇలాంటి సర్వీసుల్లో ఉన్న వారు ఆరు నెలల పాటు సమ్మెలు చేయకూడదని ఎస్మాని ప్రయోగించింది.
ఈ మేరకు జీవో నెంబర్ 2ను రిలీజ్ చేసింది ప్రభుత్వం. ఈ చట్టం ప్రకారం ప్రభుత్వ ఆదేశాలు ఉల్లంఘించి సమ్మెలు చేస్తే చర్యలు తీసుకునే అధికారం ప్రభుత్వానికి ఉంది. అంగన్‌వాడీలను డిస్మిస్ చేయవచ్చు.

అంతే కాదు వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని కేసులు కూడా పెట్టవచ్చు. ఈ కేసుల్లో సమ్మెచేసిన వారికి ఆరు నెలలు, సహకరించిన వారికి ఏడాది జైలు శిక్ష విధించే అవకాశం ఉంది.


ఎస్మా ప్రయోగించిన ప్రభుత్వం అంగన్వాడీల జీతాల్లో కూడా కోత పెట్టింది. అంగన్‌వాడీ వర్కర్లు, సహాయకులకు వేతనాల్లో మూడు వేలు తగ్గించి వారి వారి ఖాతాల్లో డబ్బులు జమ చేసింది.

# మాతృభాష కోసం నా ప్రాణాలను ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాను..



న్యూజిలాండ్ 170 ఏళ్ల పార్లమెంట్ చరిత్రలో అతి పిన్న వయస్కురాలు అయిన సాల్ ఎంపీ హనా-రౌహితి-మాపి-క్లార్క్ ప్రసంగం వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.న్యూజిలాండ్‌లోని తెగలలో మావోరీ భాష దాదాపు అంతరించిపోయింది. న్యూజిలాండ్ హెరాల్డ్ ప్రకారం.. మావోరీ ప్రజల భాషతో పాటు హక్కులను రక్షించడానికి ఈ యువ ఎంపీ పోరాడుతుంది.అయితే, కొన్ని రోజుల క్రితం ఎంపీ హనా రౌహితి పార్లమెంటులో ప్రసంగం చేస్తూ.. మావోరీ భాషలో ‘మీ కోసం నా ప్రాణాలను ఇవ్వడానికి నేను సిద్ధంగా ఉన్నాను అని తెలియజేయడంతో పాటు మీ ప్రాణాలను రక్షించడానికి కూడా నేను సిద్ధంగా ఉన్నాను’ అని పేర్కొనింది. మావోరీ తెగకు చెందిన విద్యార్థులు తమ భాషలో చదువుకునే అవకాశం రాకపోవడంతో వారు అభివృద్ధి చెందడం లేదని వాపోయారు. ఇకపై మాతృభాష నేర్చుకోవడానికి మావోలు బాధ పడాల్సిన అవసరం లేదని ఆమె భరోసా ఇచ్చారు.
మావోరీ భాషలో హనా ప్రసంగానికి నెట్టింట భారీ స్పందన వచ్చింది. దీంతో ఈ వీడియో ఇన్ స్టా గ్రామ్, ట్విట్టర్, ఫేస్ బుక్ లతో వైరల్‌గా మారింది.ఇక, 21 ఏళ్ల ఈ యువ ఎంపీ ఆక్లాండ్- హామిల్టన్ మధ్య ఉన్న హంట్లీ అనే చిన్న పట్టణంలో నివసిస్తుంది. అక్కడ ఆమె మావోరీ కమ్యూనిటీ గార్డెన్‌లో స్థానిక కమ్యూనిటీ పిల్లలకు గార్డెన్ గా ఉన్నారు. హనా మావోరీ గిరిజన హక్కుల సంస్థ నాగ టమాటాలో కూడా సభ్యురాలుగా ఉంది. హనా తనను తాను రాజకీయ నాయకురాలిగా కాకుండా మావోరీ భాషకు రక్షకురాలిగా భావిస్తుంది.. కొత్త తరం మావోరీల గొంతును ప్రపంచ వేదికపైకి తీసుకురావాల్సిన అవసరం ఉందని యువ ఎంపీ హనా రౌహితి పేర్కొనింది.

# సముద్రంలో కూలిన విమానం, కూతుళ్లతో పాటు హాలీవుడ్ నటుడు మృతి



హాలీవుడ్‌కు చెందిన ప్రముఖ నటుడు విమాన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. ఆయనతో పాటు ఇద్దరు కూతుళ్లు కూడా చనిపోయారు. వెకేషన్‌లో బాగంగా హాలీవుడ్ నటుడు క్రిస్టియన్ ఒలివర్ తన కుటుంబంతో కలిసి గ్రెనడైన్స్‌లోని బెక్వియా ద్వీపం నుంచి సెయింట్ లూసియాకు బయల్దేరారు.విమానం బెక్వియాలో టేకాఫ్ తీసుకుంది. అంతా బాగానే ఉందనుకున్న సమయంలోనే విమానం కరీబియన్ సముద్రంలో ఒక్కసారిగా కుప్పకూలింది. ఈ సంఘటనలోనే ఒలివర్‌తో పాటు ఆయన ఇద్దరు కుమార్తెలు మడిత, అన్నిక్ ప్రాణాలు కోల్పోయారు. కాగా.. ఈ సంఘటనలో పైలట్ కూడా చనిపోయాడని అధికారులు వెల్లడించారు.విమానం సముద్రంలో కూలిందన్న సమాచారం తెలుసుకున్న కోస్ట్‌గార్డ్ సిబ్బంది వెంటనే అప్రమత్తం అయ్యారు. విమానం కూలిన ప్రదేశానికి చేరుకున్నారు. కాసేపటికే నలుగురి మృతదేహాలను వెలికి తీశారు. జర్మనీ సంతతకి చెందిన ఒలివర్ తన కెరియర్‌లో 60కి పైగా సినిమాలు, టీవీ సీరియళ్లలో నటించారు. ప్రముఖ నటుడు టామ్ క్రూయిజ్ నటించిన వాల్కరీ మూవీలో కూడా ఓ చిన్న పాత్రలో కనిపించారు. కాగా.. ఒలివర్ వయసు ప్రస్తుతం 51 ఏళ్లు. కెరియర్ ఆరభంలో ఒలివర్ సేవ్డ్ బై దిబెల్, ది న్యూ క్లాస్, బేబీ సిట్టర్స్ క్లబ్ సీరియళ్లతో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. పాపులర్ షో అలారమ్ ఫర్ కోబ్రా-11లో ఒలివర్ రెండు సీజన్లలో నటించారు. హాలీవుడ్ నటుడు ఇద్దరు కూతళ్లతో పాటు చనిపోయినట్లు సెయింట్ విన్సెంట్ అండ్ గ్రెనడీన్స్ పోలీసులు ప్రకటనలో వెల్లడించారు. క్రిస్టియన్ ఒలివర్ తన ఇద్దరు కూతళ్లతో పాటు చనిపోవడంతో విషాద చాయలు అలుముకున్నాయి. పలువురు ప్రముఖులు వీరి మరణం పట్ల సంతాపం తెలుపుతున్నారు.

# ప్రభుత్వ పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్యే నాగరాజు

వర్ధన్నపేట, జర్నలిస్ట్ వార్త ప్రతినిధి: వర్ధన్నపేట నియోజకవర్గం పర్వతగిరి మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలను శనివారం వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు సందర్శించారు. పాఠశాలలోని పదవ తరగతి పరీక్ష రాసే విద్యార్థినీ, విద్యార్థులకు ఉచితంగా పరీక్ష ప్యాడ్, పెన్నులు, కంపాక్స్ బాక్స్ లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వర్ధన్నపేట ఎమ్మెల్యే మాట్లాడుతు పిల్లలందరూ బాగా చదివి మీ తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకుని రావాలన్నారు. ప్రధానంగా బాలికలు రాష్ట్రంలో జిల్లాను మొదటి స్థానంలో ఉండేలా చదివి పేరు తీసుకోవాలని రావాలని కోరారు. ఈ పాఠశాలలో స్పోర్ట్స్ విద్యార్థులు చాలా ప్రతిభ కలిగిన విద్యార్థులు ఉన్నారు. భవిష్యత్తులో విద్యార్థులకు ఎలాంటి ఆటంకాలు రాకుండా తాను అండగా ఉంటానని హామీ ఇచ్చారు. క్రీడల్లో రాణించాలని విద్యార్థినీ, విద్యార్థులకు ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు పిన్నింటి అనిల్ రావు, మండల అధ్యక్షులు జాటోతు శ్రీనివాస్, వరంగల్, హనుమకొండ జిల్లాల కిసాన్ జిల్లా అధ్యక్షులు బొంపల్లి దేవేందర్ రావు, పింగిలి వెంకట నర్సయ్య రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు అబ్బిడి రాజిరెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఎంపిటిసి, స్కూల్ మేనేజింగ్ కమిటీ, జెడ్పీటీసీ, హై స్కూల్ ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## దళితులను మోసం చేసిన నేతలపై ఎస్సీఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టాలి

**– కాంగ్రెస్ నాయకులు రాయపురం సాంబయ్య**



వరంగల్ బ్యూరో, జర్నలిస్ట్ వార్త ప్రతినిధి: గత పది సంవత్సరాలలో దళితులకు అనేక ఆశలు చూపించి మోసం చేసిన నాయకులపై ఎస్సీఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టాలని శనివారం కాంగ్రెస్ సీనియర్ నాయకులు రాయపురం సాంబయ్య అన్నారు. అధికారాన్ని దక్కించుకోవాలనే ఉద్దేశ్యంతో దళితులని ముఖ్యమంత్రి చేస్తానని మోసపూరిత వాగ్దానాలు చేసిన కేసిఆర్ కుటుంబ సభ్యులపై అట్రాసిటీ కేసుతో పాటు చీటింగ్ కేసు పెట్టాలన్నారు. దళితులకు మూడు ఎకరాల భూమి, దళిత బంధు పేరుతో 10 లక్షల రూపాయలు, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇస్తామని చెప్పి, దళితులను మోసం చేసి అధికారంలోకి వచ్చిన టిఆర్ఎస్ పార్టీ ఏ ఒక్క వాగ్దానం కూడా దళితులకు నెరవేర్చలేదన్నారు. బీఆర్ఎస్ చేసిన మోసానికి మొన్న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు ఆయుధంతో దళితులు సరైన బుద్ధిచెప్పారు. మళ్లీ ఎంపి ఎన్నికలు అంటూ ఓటుకోసం వస్తారు. మరోసారి దళితులు బుద్ధిచేపాల్సిన అవసరం ఉందన్నారు. సర్పంచ్, ఎంపీటీసీ ఎన్నికల్లో సైతం దళితులను మోసం చేసిన వారిపై ప్రతీకారం తీర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పున్నేలు గ్రామ పార్టీ అధ్యక్షులు ఇల్లందుల సారయ్య, పున్నేలు గ్రామ సర్పంచ్ కత్తి దేవేందర్ గౌడ్, రావుల రాజు, మామునూరు చేరాలు, మామునూరు నర్సయ్య, కత్తి సుధీర్, ఎండి గౌస్ పాషా, బోళ్ల అశోక్, శాతాల రాజు, మామునూరు బాబు, ఇల్లందుల రాజేష్, కత్తి శివ, మహేష్, పున్నేలు గ్రామ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఐనవోలు జాతర ఏర్పాట్లు పరిశీలించిన దేవాదాయ సంయుక్త కమిషనర్ రామకృష్ణ రావు



హనుమకొండ, జర్నలిస్ట్ వార్త ప్రతినిధి: ఐనవోలు మండలంలోని శ్రీ మల్లికార్జున స్వామి జాతర ఏర్పాట్లును శనివారం దేవాదాయ ధర్మాదాయ శాఖ ప్రాంతీయ సంయుక్త కమీషనర్ యం.రామకిష్ణ రావు పరిశీలించారు. ఈ సందర్భంగా వారిని దేవాలయ నిర్వాహకులు ఘనంగా స్వాగతించారు. ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతర కార్యనిర్వహణాధికారి అద్దంకి నాగేశ్వర్ రావు జాతర ఏర్పాట్లలో భాగంగా భక్తులకు ఏర్పాటు చేస్తున్న సౌకర్యాలపై కమిషనర్ కు వివరించారు. వారి వెంట దేవాలయ నిర్వాహకులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

## సందేహాలతోనే ముగిసిన ప్రజాపాలన

హైదరాబాద్, జనవరి 6 రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన దరఖాస్తుల కార్యక్రమం ప్రజల నుంచి వ్యక్తమైన అనేక సందేహాలకు ఎలాంటి సమాధానమివ్వకుండానే ముగిసింది.అభయ హస్తం పేరుతో ఆరు గ్యారెంటీల అమలుకు లబ్ధిదారుల ఎంపిక కోసం గత నెల 28న ప్రారంభమైన ప్రజా పాలన కార్యక్రమం శనివారంతో ముగిసింది. ఈ పది రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా 1,25,84,383 మంది తమ దరఖాస్తులను అధికారులకు అందించారు. దరఖాస్తుల స్వీకరణకు గడువు ముగిసే నాటికి కూడా ప్రజల నుంచి వ్యక్తమైన సందేహాలను ప్రభుత్వం నివృత్తి చేయలేకపోయింది. కోటికి పైగా వచ్చిన దరఖాస్తుల పరిశీలన ఎప్పుడు పూర్తవుతుంది, లబ్ధిదారుల ఎంపిక ఎలా జరుగుతుంది, వారికి పథకాలను ఎప్పటి నుంచి అమలు చేస్తారు అన్నదానిపై ప్రభుత్వ పెద్దలు ఇంతవరకు నోరు మెదపలేదు.సబ్సిడీపై వంట గ్యాస్, రైతుబంధు, పింఛన్లు తదితర పథకాలకు లబ్ధిదారుల ఎంపికపై రాష్ట్ర ప్రజల్లో అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఉదాహరణకు దరఖాస్తు పత్రాల్లో దరఖాస్తుదారుల బ్యాంకు ఖాతా నంబర్‌ను అడగకపోవడంతో.. పెన్షన్ చెల్లింపులు ఎలా జరుగుతాయని పలు చోట్ల మహాలక్ష్మి పథకం కోసం దరఖాస్తు చేసుకున్నవారు ప్రశ్నించడం కనిపించింది. మహాలక్ష్మి పథకం కింద అర్హులైన మహిళలకు ప్రభుత్వం ప్రతినెల రూ.2500 చెల్లిస్తామన్న సంగతి తెలిసిందే. ఇక వంట గ్యాస్ సబ్సిడీని అన్ని వర్గాల వారికి వర్తింపచేస్తారా లేక దానికేమైనా ప్రత్యేకమైన ఎంపిక విధానం ఉంటుం దా అన్న ప్రశ్నలకు సమాధానం చెప్పేవారే కరువయ్యారు. మొదట్లో రేషన్‌కార్డుల జారీపై ఎటువంటి స్పష్టతనివ్వకపోడంతో ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తంచేశారు.

## రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఉపాధ్యాయురాలు



హనుమకొండ, జర్నలిస్ట్ వార్త ప్రతినిధి: కాకతీయ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బీమారం పెట్రోల్ బంక్ ఎదుట శనివారం రోడ్డు ప్రమాదంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే ఓ ప్రైవేట్ పాఠశాల ఉపాధ్యాయురాలుగా పని చేస్తున్న సునయన (27) తన ద్విచక్రవాహనంపై హనుమకొండ నుండి కరీంనగర్ వైపుగా వెళ్తున్నారు. ఈ క్రమంలో వెనుక నుంచి వచ్చిన మరో ద్విచక్రవాహనం బలంగా ఢీకొట్టింది. దీంతో సునయన లారీకింద పడ్డారు. ద్విచక్రవాహనదారుడు ఎడమవైపు పడిపోయారు. సునయన లారీ కిందపడి తన రెండు కాళ్ళు నుజ్జునుజ్జు అయ్యాయి. దీంతో వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయి. కేయూ ఇన్ స్పెక్టర్ ముసుకు అబ్బయ్య, ఎస్సై సురేష్, ట్రాఫిక్ పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. నిలిచిపోయిన వాహనాలకు విముక్తి కల్పిస్తూ, ట్రాఫిక్ ని క్రమబద్ధీకరించారు. అనంతరం108 అంబులెన్స్ వాహనంలో ఫస్ట్ రెస్పాండర్ యుగంధర్ ప్రాథమిక చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం ఎంజీఎం తరలించారు. ప్రస్తుతం ఆమె పరిస్తితి విషమంగా ఉందని ఎంజీఎం వైద్యులు తెలిపారు.

## మేడారం సమ్మక్క సారలమ్మలను దర్శించుకున్న మంత్రి వర్యులు సీతక్క



వరంగల్ బ్యూరో, జర్నలిస్ట్ వార్త ప్రతినిధి: కన్నుల పండువగా జరగనున్న ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం సమ్మక్క సారలమ్మ జాతరకు సమయదగ్గరపడుతోంది. ప్రతీ ఏటా జతరకు వచ్చే భక్తుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. శనివారం పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి వర్యులు డాక్టర్ దనసరి అనసూయ సీతక్క అమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా దేవాలయం ఆవరణంలో జరుగుతున్న జాతర ఏర్పాట్లను పరిశీలించి, భక్తులకు ఏమాత్రం ఇబ్బందులు ఏర్పడకుండా త్వరితగతిన పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. అమ్మవార్ల దర్శనార్థమై దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఏమాత్రం ఇబ్బందులు కలుగకుండా జాగ్రత్త చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లా అధికార యంత్రాంగం ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహించి జాతర పనులు పరిశీలించి, పనులు వేగవంతం చేసే విధంగా అధికారులు పని చేయాలన్నారు. ఈ మహా జాతరకు రాష్ట్ర ప్రభుత్వం 75 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేసిందన్నారు. నిర్మాణ పనుల్లో కాంట్రాక్టర్లు అలసత్వం వహిస్తే బ్లాక్ లిస్ట్ లో పెడతామన్నారు. భక్తుల కోసం బస్ స్టేషన్, వాహనాల పార్కింగ్, ఆలయ సమీపంలోని రోడ్లు పరిశీలించిన మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్ త్రిపాఠి ఐఎఎస్ పలు శాఖల అధికారులకు పలు సూచనలు చేశారు. వారి వెంట ఐటిడిఎ పిఓ అంకిత్ ఐఎఎస్, ఎస్పీ శభరిష్, అడిషనల్ కలెక్టర్ శ్రీజ ఐఎఎస్, ఐటిడిఏ ఈఈ హేమలత, వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు పైడాకుల అశోక్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర, జిల్లా బ్లాక్ మండల, గ్రామస్థాయి నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ఏపార్టీలోఉన్నా జాతి ఐక్యత కోసం ముందుండాలి

**– నాయకులు మిద్దె పాక రవీందర్**



నల్లగొండ, జర్నలిస్ట్ వార్త ప్రతినిధి: ఇప్పటివరకు రాష్ట్రంలో ఎన్నో కుల సంఘాలు ఏర్పడ్డాయని మాదిగల ఐక్య సంక్షేమ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు మిద్దేపాక రవీందర్ అన్నారు. ఐనప్పటికీ కొన్ని సంఘాల నాయకులు స్వార్థ ప్రయోజనాల కోసమే సంఘాలు ఉపయోగపడుతున్నాయని అన్నారు. శనివారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ భవనంలో జిల్లాస్థాయి సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ ఇప్పుడున్న ఈ సమయంలో మాదిగలంతా ఏకం కావాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. ఏ పార్టీలో ఉన్నా సరే జాతి ఐక్యత కోసం అందరూ ముందుకు రావాలని కోరారు. వచ్చే పార్లమెంటు ఎన్నికల సమయంలో అన్ని పార్టీలలో నాయకులు మాదిగలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సంఘం ఏపార్టీకి, ఏవర్గానికి అనుకూలంగా పనిచేయదన్నారు. అన్ని పార్టీలలో, ప్రజాసంఘాలలో, కుల సంఘాలలో ఉన్న మాదిగలు వారి వారి పార్టీలలో పనిచేసుకుంటూ మాదిగల హక్కుల సాధన కోసం ప్రతి ఒక్కరు కలిసికట్టుగా ముందుకొచ్చి మాదిగ ఐక్యతను చాటి చెప్పాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు శంకర్, మామిడి ప్రమీల, రవి, మహేష్, భీమ్ ప్రసాద్, రాజు, శ్యాం ప్రసాద్, శోభన్ బాబు, ఇస్తారి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలు సందర్శించిన పాలకుర్తి ఎమ్మెల్యే



తొర్రూరు, జర్నలిస్ట్ వార్త ప్రతినిధి: పాలకుర్తి నియోజకవర్గం తొర్రూరు మండలం కర్కాల, హరిపిరాల గ్రామాలలో ప్రభుత్వ పాఠశాలలు శనివారం పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో ఉన్న వసతులు, తీర్చాల్సిన సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. వారి వెంట స్థానిక అధికారులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

## కబడ్డీ క్రీడా ప్రారంభించిన పాలకుర్తి ఎమ్మెల్యే



పాలకుర్తి, జర్నలిస్ట్ వార్త ప్రతినిధి: పాలకుర్తి మండలం నారాబోయినగూడెం గ్రామంలో కబడ్డీ పోటీలు ఏర్పాటు చేశారు. శనివారం సేవాలాల్ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రీడలను పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులతో మాట్లాడుతూ యువకులకు శారీరక దృఢత్వాన్ని పెంపొందించుకోవడానికి క్రీడలు దోహదపడతాయని అన్నారు. వారి వెంట స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

## డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను పరిశీలించిన ఎమ్మెల్యే



పాలకుర్తి, జర్నలిస్ట్ వార్త ప్రతినిధి: పాలకుర్తి మండలం నారాబోయినగూడెం గ్రామంలో పాలకుర్తి ఎమ్మెల్యే హనుమాన్ల యశస్విని రెడ్డి శనివారం గ్రామస్తులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను పరిశీలించారు. సంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల విషయమై గ్రామస్తులతో చర్చించారు.

## లంచం తీసుకుంటూ పట్టుబడ్డ ట్రాఫిక్ ఎస్సై

**– సస్పెండ్ చేసిన వరంగల్ పోలీస్ కమిషనర్**



హనుమకొండ, జర్నలిస్ట్ వార్త ప్రతినిధి: వాహనదారుల వద్ద లంచం తీసుకుంటూ సీసీ కెమెరాలో చిక్కుకున్న ట్రాఫిక్ ఎస్సై శనివారం సస్పెండ్ అయ్యారు. తప్పుచేస్తే నిందితులను శిక్షించడమే కాదు, శిక్షించే పోలీసులు తప్పుచేసినా ఊరుకునేది లేదని వరంగల్ పోలీస్ కమిషనర్ నిరూపించారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పోలీసులు పెండింగ్ చాలాన్స్ వసూల్ చేయడంలో బిజీగా ఉన్నారు. కానీ హనుమకొండ పట్టణ కేంద్రంలోని ములుగు క్రాస్ రోడ్ వద్ద విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ ఎస్సై డ్రైవింగ్ లైసెన్స్ లేని వాహన దారులను నిలువుదోపిడీ చేస్తున్నారు. ఈ తతంగమంతా ఎవరో చూసింది కాదు. నిఘా నేత్రంలో రికార్డయిన వాస్తవాన్ని స్వయంగా పోలీస్ కమిషనర్ గమనించి ఎస్సైపై సస్పెన్షన్ వేటు వేశారు.

ఆదివారం
7 జనవరి 2024
వార్త

# మూడేండ్లలో 3 వేల కోట్లు పెట్టుబడి పెట్టనున్న అపోలో హాస్పిటల్స్

హైదరాబాద్: ప్రముఖ వైద్య సేవల సంస్థ అపోలో హాస్పిటల్స్ తన వ్యాపారాన్ని భారీగా విస్తరించబోతున్నది. వచ్చే మూడేండ్లకాలంలో రూ.3 వేల కోట్లతో 2 వేల పడకలను ఏర్పాటు చేయబోతున్నట్టు అపోలో హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ సునీతా రెడ్డి తెలిపారు. మెడికల్ టూరిజం
భారీగా వృద్ధిచెందుతుండటంతో 2028 నాటికి భారీగా లక్ష్యాలను నిర్దేశించుకున్నట్టు ఆమె విశ్లేషించారు. ఇక నుంచి ప్రతియేటా 700 పడకలచొప్పున వచ్చే మూడేండ్లకాలంలో మొత్తంగా 2 వేల పడకలను నెలకొల్ప బోతున్నట్లు తెలిపారు. ప్రస్తు తం అపోలోకు పలు రాష్ట్రాల్లో 70 ఆసుపత్రులు, 10 వేల పడకలు, 400 క్లినిక్స్, 6 వేల ఫార్మసీలు ఉన్నాయి.

# జిల్లా స్థాయి అధికారులకు ప్రజా ఆరోగ్య వైద్య ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సన్మానాలు



ఆదిలాబాద్ ప్రజా ఆరోగ్య మరియు ఉద్యోగుల సంఘం 3194 ఆధ్వర్యంలో ఆదిలాబాద్ జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నరేంద్ర రాథోడ్ ను ఇటీవల జిల్లా అధ్యక్షులుగా ఎంపికైన ప్రజా ఆరోగ్య వైద్య మరియు ఉద్యోగుల సంఘం 3194 జిల్లా అధ్యక్షులు సత్యనారాయణ ఆధ్వర్యంలో సన్మానం చేశారు. అడిషనల్ డి ఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ సాధన పి .ఎన్.డి టి టి డాక్టర్ మనోహర్ జిల్లా మలేరియా నివారణ అధికారి డాక్టర్ శ్రీధర్ మెట్పల్లి వార్ లను కూడా సన్మానం చేశారు. అనంతరం జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయ సూపరిండెంట్లు గోపి, రవి తోపాటు శ్రీకాంత్ రెడ్డి లను సన్మానించారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ శాలువాతో సత్కరించి పుష్పగుత్యాన్ని అందజేశారు. ప్రజా ఆరోగ్య వైద్య ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు సత్యనారాయణ, గౌరవ అధ్యక్షులు బాబూలాల్లో మాట్లాడుతూ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నరేందర్ ను కోరారు. చాలామంది అనేక రకాల సమస్యలతో బాధపడుతున్నారని ఉద్యోగుల న్యాయమైన సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు కృషి చేయాలని డిఎం అండ్ హెచ్ ఓ వారు కోరారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్ మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు తన వంతుగా కృషి చేస్తానని ఈ సందర్భంగా తెలిపారు. న్యాయమైన సమస్యలను వెంటనే పరిష్కరిస్తానని తెలిపారు.

# బాలీవుడ్ నటికి సర్జరీ విజయవంతం



ఊర్వశి 'కసౌతీ జిందగీ కే', 'కహీన్ తో హెూగా', 'ఇష్క్ మే మార్జవాన్' మరియు ఇతర చిత్రాలకు ప్రసిద్ధి చెందింది. మెడ భాగంలో అయిన కణితికి శస్త్ర చికిత్స చేయించుకున్న నటి ఊర్వశి ధోలాకియా తన శస్త్రచికిత్స విజయవంతమైందని, కొన్ని రోజులు విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు సూచించినట్టు తెలిపారు. ఊర్వశి 'కసౌతీ జిందగీ కే', 'కహీన్ తో హెూగా', 'ఇష్క్ మే మార్జవాన్' లాంటి ఇతర చిత్రాలకు ప్రసిద్ధి చెందింది. అంతకుముందు షేర్ చేసిన ఫొటోలో ఊర్వశి హాస్పిటల్ బెడ్‌పై పడుకుని కెమెరా వైపు నవ్వుతూ కనిపించింది. ఒక ప్రకటనలో ఆమె.. "డిసెంబర్ 2023 ప్రారంభంలో మెడలో కణితి (తిత్తి) ఉన్నట్లు నిర్ధారణ అయినందున నేను శస్త్రచికిత్స చేయించుకోవలసి వచ్చింది. నా శస్త్రచికిత్స విజయవంతమైంది. ఇప్పుడు నేను 15 నుండి 20 రోజులు విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు సూచించారు" అని చెప్పింది. ఇక ఆమె వర్క్ ఫ్రంట్‌లో, ఇటీవల సెలబ్రిటీ డ్యాన్స్ రియాలిటీ షో 'ఝలక్ దిఖ్లా జా 11'లో పోటీదారుగా కనిపించింది. అయితే ఈ షో నుంచి ఆమె ఎలిమినేట్ అయింది. అంతే కాకుండా ఆమె 'పుష్ప ఇంపాజిబుల్'లో దేవి సింగ్ షెకావత్‌గా కూడా కనిపించింది.

# లైసెన్స్ లేకుండా మందుల తయారీ

## ఫ్యాక్టరీ పై దాడులు 50.5 లక్షల డయాసెరీన్ సీజ్




తెలంగాణ: లైసెన్స్కుండా అక్రమంగా మందులు తయారు చేస్తున్న ఫ్యాక్టరీపై డ్రగ్కంట్రోల్ అధికారులు శుక్రవారం దాడులు జరిపారు. 50.25లక్షల విలువ చేసే మందులను స్వాధీనం చేసుకున్నారు. గ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ జనరల్ వీ.బీ.కమలాసన్రెడ్డి తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం బొంతపల్లిలోని రక్షిత్అడ్రగ్స్ప్రైవేట్లిమిటెడ్అన్న ఫ్యాక్టరీలో ఎలాంటి లైసెన్స్ లేకుండా డయాసెరీన్ అనే మందును తయారు చేస్తున్నట్టు డ్రగ్కంట్రోల్ అధికారులకు సమాచారం అందింది. ఈ క్రమంలో సదరు ఫ్యాక్టరీపై దాడులు జరిపిన అధికారులు సీడీఈ ఎల్అని లేబుల్వేసి ఉన్న 9 డ్రమ్ముల పసుపు రంగు పౌడర్ ను సీజ్చేశారు. అధికారులు జరిపిన విచారణలో ఇది డయాసెరీన్ మందు అని బయటపడింది. ఈ మందును అక్రమంగా తయారు చేస్తూ మార్కెట్లో అమ్ముతున్నట్టుగా నిర్ధారణ అయ్యింది. ఇక, మందులు తయారు. చేస్తున్న ఫ్యాక్టరీ ఆవరణ మొత్తం అపరిశుభ్రంగా ఉన్నట్లు తేలింది. ఈ క్రమంలో అధికారులు మొత్తం 50.25 లక్షల రూపాయల విలువ చేసే 236 కిలోల పౌడర్ను స్వాధీనం చేసుకున్నారు. ఫ్యాక్టరీలో అసిస్టెంట్ జనరల్మేనేజర్గా పని చేస్తున్న అనీష్కళ్యాణాడుల సమయంలో అక్కడే ఉన్నట్టు కమలాసన్రెడ్డి తెలిపారు. దాడుల్లో డ్రగ్ఇన్స్ పెక్టర్ పీ.రాము, అన్వేష్, కార్తీక్ శివ చైతన్య, క్రాంతి కుమార్ తదితరులు పాల్గొన్నట్టు చెప్పారు. సీజ్చేసిన పౌడర్ నమూనాలను అనాలిసిస్ నిమిత్తం ల్యాబ్కు పంపించినట్టు పేర్కొన్నారు.

# కరోనాతో ఒక్కరోజే 12 మంది మృతి

## - తాజాగా 761 మందికి పాజిటివ్



న్యూఢిల్లీ,): దేశంలో కరోనా చాపకింద నీరులా విస్తరిస్తున్నది. కరోనాతో ఒక్కరోజే 12 మంది ప్రాణాలు కోల్పోయారు. కేరళలో ఐదుగురు, కర్ణాటకలో నలుగురు, మహారాష్ట్రలో ఇద్దరు, ఉత్తరప్రదేశ్‌లో ఒకరు మృతిచెందారు. గురువారం నుంచి శుక్రవారం నాటికి 24 గంటల్లో దేశవ్యాప్తంగా 761 కరోనా కేసులు నమోదయ్యాయి.దీంతో యాక్టివ్ కేసుల సంఖ్య 4,334కు చేరింది. మరోవైపు దేశవ్యాప్తంగా ఇప్పటివరకు కరోనా సబ్ వేరియంట్ జేఎన్.1 కేసులు 619 నమోదయ్యాయి. వీటిలో అత్యధికంగా కర్ణాటకలో 199, కేరళలో 148, మహారాష్ట్రలో 47 వెలుగుచూశాయి.

# నారాయణమహిళా కళాశాలలో ఫుడ్ పాయిజన్ 200 మంది విద్యార్థులు అస్వస్థత




దుండిగల్ : మల్లంపేట లోని నారాయణ మహిళా జూనియర్ కళాశాల తరుచూ వివాదాలకు కారణం. అవుతోంది. గతంలో కళాశాలలో చదువుతున్న విద్యార్థులను మరోచోటికి పంపించడంతో తల్లి దండ్రులతో పాటు విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేశారు. తాజాగా కలుషిత ఆహారం తిని పలువురు విద్యార్థులు అస్వస్థతకు గురికావడంతో హుటా హుటిన విద్యార్థులను స్థానికంగా ఉండే ప్రైవేట్ ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం. విద్యార్థుల అస్వస్థతకు కలుషిత ఆహారం, తాగునీరు కలుషితం కావడమే కారణంగా తెలుస్తుంది. కళాశాల వంటగదిని పరిశీలించిన ఫుడ్ సేఫ్టీ అధికారులు చర్యలకు ఉపక్రమిస్తున్నట్లు సమాచారం. సంక్రాంతి సెలవుల పేరుతో విద్యార్థులను యాజమాన్యం తరలిస్తున్నట్లు తెలుస్తోంది.

# ఔషధాలు సూచించే ఏఐ

## - వ్యాధుల చికిత్సలో నూతన వేదిక
## -ఆవిష్కరించిన ఉప్పలూరి కేహెచ్ క్లినిక్





హైదరాబాద్, రోగి జన్యు నిర్మాణం ఆధారంగా వైద్య చికిత్సను సిఫారసు చేసేలా వైద్యులకు ఉపకరించే ఓ వేదికను ఉప్పలూరి కే హెచ్ పర్సనలైజ్డ్ మెడిసిన్ క్లినిక్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ రూపొందించింది. వైద్యరంగంలో ఓ మైలురాయిగా నిలిచిపోయే కృత్రిమ మేధస్సుతో కూడిన వేదిక 'జీన్‌కనెక్ట్ ఆర్ఎక్స్'ను ఆవిష్కరించారు. ఇది కృత్రిమ మేధస్సుతో వ్యాధులను సమగ్రంగా అధ్యయనం చేసి సరైన ఔషధాలను సూచించే సరికొత్త పరిజ్ఞానమని డాక్టర్ కల్యాణ్ ఉప్పలూరి తెలిపారు. ఏఐ ఆధారిత డ్రగ్ డిస్కవరీ ప్లాట్‌ఫామ్ అయిన జీన్‌కనెక్ట్ ఆర్ఎక్స్‌ను ప్రముఖ వైద్యుల సమక్షంలో ఆవిష్కరించారు. కల్యాణ్ ఉప్పలూరి మాట్లాడుతూ వైద్య రంగంలోనూ కృత్రిమ మేధస్సును సమర్థంగా వినియోగించేందుకు అవకాశం ఉందని గుర్తించిన తమ సంస్థ ఏఐ ఆధారంగా పనిచేసే జీన్‌కనెక్ట్ ఆర్ఎక్స్‌ను అందుబాటులోకి తీసుకువచ్చిందని తెలిపారు. మెదడు క్యాన్సర్, మోనోజెనిక్ మధుమేహం, పార్కిన్సన్స్ వ్యాధి, అధిక కొలెస్ట్రాల్, ఆటిజం వంటి వ్యాధుల చికిత్సకు రోగి జన్యువులను బట్టి ఎలాంటి ఔషధాలను వాడాలో సూచిస్తుందని పేర్కొన్నారు. ప్రముఖ దవాఖాన ఏఐజీతో కలిసి ఫార్మకోజెనోమిక్స్ అధ్యయం చేపట్టామని, దాని ద్వారా జీన్‌కనెక్ట్ ఆర్ఎక్స్‌ను రూపొందించామని డాక్టర్ హిమ చల్లా తెలిపారు. కార్యక్రమంలో ఏఐజీ దవాఖాన చైర్మన్ అండ్ చీఫ్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ పద్మభూషణ్ డాక్టర్ డీ నాగేశ్వర్‌రెడ్డి, వైస్ చైర్మన్ పెన్మత్స వెంకటసుబ్బరాజు, సీసీఎంబీ మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ సీహెచ్ మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# శీతాకాలంలో పాటించాల్సిన


శీతాకాలంలో పాటించవలసిన జాగ్రత్తల గురించి మంతెన లావణ్య కొన్ని చిట్కాలను తెలిపారు. ఆ చిట్కాలు పాటించడం వల్ల చర్మం నిగనిగలాడే విధంగా ఉంటుందని ఆమె అభిప్రాయం వ్యక్తం చేసింది. శరీరాన్ని ముందే జబ్బులు రాకుండా ఉంటాయి అందుకు కొన్ని చిట్కాలు ఇవే..సీజన్‌తో సంబంధం లేకుండా, సమ్మర్ అయినా వింటర్ అయినా బాడీ టెంపరేచర్ ని రెగ్యులేట్ చేయాలంటే నీరు అవసరం. తగినంత నీరు తాగుతూ ఉండడం వల్ల లోపలి నుండి టెంపరేచర్ రెగ్యులేషన్ జరుగుతుంది. హైపోథెర్మియా లాంటి కండిషన్స్ ని రక్షణ చేయవచ్చును.చలిగా, పొడిగా ఉండే వాతావరణం ఎనర్జీనంతా పీల్చేస్తుంది. ఫలితంగా బద్ధకంగా అనిపించడంతో పాటు జలుబు, ఫ్లూ వంటి సమస్యలు కూడా ఎదుర్కోవలసి వస్తుంది. నీరు తాగడం వలన ఇమ్యూనిటీ బూస్ట్ అవుతుంది, ఇన్‌ఫెక్షన్స్ బారిన పడకుండా ఉంటారు.హైడ్రేటెడ్ గా ఉంటే శరీరానికి ఫ్యాట్స్‌ని బ్రేక్ డౌన్ చేయడం తేలిక అవుతుంది. ఫలితంగా బరువు తగ్గడం తేలిక అవుతుంది.; నీరు సరిపోకపోతే ఆ ఎఫెక్ట్ ముందుగా కనిపించేది స్కిన్ మీదే. స్కిన్ డ్రై గా, డల్‌గా తయారవుతుంది. స్కిన్ హెల్త్ కి కూడా నీరు అత్యవసరంశీతాకాలం రాగానే శరీరం పొడిబారినట్లవుతుంది. కొందరిలో చర్మం చిట్లుతుంది. పెదవులు పగిలిపోతుంటాయి. ముఖ్యంగా మహిళలు శరీరం పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలి. పొడి చర్మం కలిగిన వారైతే%Ô™% రెండు టీ స్పూన్లు బాదంనూనె, రెండు టీస్పూన్ల బాదం పొడి, రెండు టీ స్పూన్లు అరటి ముక్కలు, రెండు టీస్పూన్లు గ్లిజరిన్ లేదా తేనే, నాలుగు టీ స్పూన్లు పాలు కలిపి మెత్తని గుజ్జు మాదిరి పేస్ట్ చేసి ముఖానికి, మెడకు మదువుగా మసాజ్ చేస్తూ పట్టించి కొద్దిసేపు వుంచి కడిగేయాలి. చర్మం మదువుగా మారుతుంది. శీతాకాలంలో అద్భుతంగా పనిచేస్తుంది. చేతులు, పాదాలకు కూడా అప్లరు చేయవచ్చు.

జిడ్డు చర్మం కలిగిన వారు.. రెండు టీ స్పూన్లు ఓట్‌మీల్ పొడి, నాలుగు టీ స్పూన్లు మజ్జిగ, రెండు టీ స్పూన్లు గంధం పొడి కలిపి ముఖానికి, మెడకు బాగా పట్టించి, గోరువెచ్చని నీటితో కడిగేస్తే జిడ్డు చర్మం పోయి కాంతివంతంగా ఉంటుంది.





ఇక శిరోజాల సంరక్షణకు.. కప్పు బొప్పాయి గుజ్జు, అరకప్పు కొబ్బరి క్రీమ్ లేదా పాలు, పావు కప్పు కొబ్బరినూనె, పావు కప్పు బీట్ రూట్ జ్యూస్ కలిపి పేస్టు తయారు చేసుకుని జుట్టుకు
పట్టించాలి. పదినిమిషాలాగి హెర్బల్ షాంపూతో వాష్ చేసుకోవాలి. శీతాకాలంలో ఈ ప్యాక్ జుట్టును పరిరక్షిస్తుంది. జుట్టురాలడాన్ని, చుండ్రును తగ్గిస్తుంది.
మంతెన లావణ్యఆదిలాబాద్




# గుంటూరు కారం భలే క్రేజీ

అతడు, ఖలేజా చిత్రాల తర్వాత త్రివిక్రమ్-మహేశ్ బాబు కాంబినేషన్లో వస్తున్న చిత్రం 'గుంటూరు కారం' పై ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ నిర్మిస్తున్న ఈ చిత్రం సంక్రాంతి కానుకగా జనవరి 12న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇప్పటికే ఈ చిత్రంలో లిరికల్ సాంగ్స్ లక్షల వ్యూస్‌తో యూట్యూబ్‌ను షేక్ చేస్తున్నాయి. ఇప్పుడు సినిమా ప్రీమియర్ షో విషయంలోను రికార్డు సృష్టించింది. 'గుంటూరు కారం' కోసం జనవరి 11న అమెరికాలో 5,408 ప్రీమియర్ షోలు వేయనున్నారు. తెలుగు సినిమాకు ఇన్ని షోలు వేయడం రికార్డని చిత్ర బృందం తెలిపింది. తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో నిర్మాత నాగవంశీ సినిమాపై మరోసారి ధీమా వ్యక్తం చేశారు. సినిమా అద్భుతంగా వచ్చిందనీ, తమన సంగీతం, బ్యాగ్రౌండ్ స్కోర్ సినిమాను మరో స్థాయికి తీసుకెళుతుందని చెప్పారు. అయితే ఈ చిత్రం ప్రీ రిలీజ్ వేడుక శనివారం హైదరాబాద్‌లో జరగాల్సి ఉంది. కానీ సెక్యూరిటీ, పోలీసు అనుమతులు ఇతర కారణాలతో ఈవెంట్ వాయిదా పడింది. ఈ విషయంలో మాత్రం అభిమానులు నిరుత్సాహపడుతున్నారు. శ్రీలీల, మీనాక్షి చౌదరి ఈ చిత్రంలో కథానాయికలుగా నటించారు.




# గీతాంజలి మళ్లీ వచ్చింది..

## ఫస్ట్ లుక్ విడుదల

టాలీవుడ్ హీరోయిన్ అంజలి టైటిల్ రోల్‌లో నటిస్తున్న తాజా చిత్రం గీతాంజలి మళ్లీ వచ్చింది. 2014లో కామెడీ అండ్ హార్రర్ బ్యాక్‌డ్రాప్‌లో వచ్చిన సూపర్ హిట్ చిత్రం 'గీతాంజలి' సినిమాకు ఈ చిత్రం సీక్వెల్‌గా రాబోతుంది. ఇక ఈ సినిమాలో శ్రీనివాస్ రెడ్డి కథనాయకుడిగా నటిస్తుండగా.. సత్యం రాజేశ్, షకలక శంకర్

, అలీ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. అంజలి 50వ సినిమాగా రానున్న ఈ చిత్రానికి కోన వెంకట్ కథ, స్క్రీన్ ప్లేను అందిస్తుండగా.. శివతుర్లపాటి దర్శకత్వం వహిస్తున్నాడు.


ఇప్పటికే కొత్త సంవత్సరం కానుకగా మూవీ నుంచి అంజలి ఫస్ట్ లుక్ పోస్టర్‌తో పాటు హీరో సునీల్ ఫస్ట్ లుక్‌లను విడుదల చేయగా ప్రేక్షకులను ఆకట్టుకుంది. తాజాగా ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఈ పోస్టర్‌లో పాడుబడిన బిల్డింగ్‌లో అంజలి, శ్రీనివాస్ రెడ్డి, సత్యం రాజేశ్, షకలక శంకర్, అలీ, సునీల్ ఉండగా.. పైకి దేనినో సీరియస్‌గా చూస్తున్నట్లు ఉంది. ఇక వీళ్ళందరూ ఎందుకు అలా చూస్తున్నారు అనేది తెలియాలంటే సినిమా రిలీజ్ వరకు వెయిట్ చేయాల్సిందే.

ఎంవీవీ సినిమాస్ బ్యానర్‌తో కలిసి కోన ఫిలిం కార్పొరేషన్ బ్యానర్‌పై కోన వెంకట్ ఈ సినిమాను తెరకెక్కిస్తుండగా.. ప్రవీణ్ లక్కరాజు సంగీతం అందిస్తున్నాడు. తెలుగుతో పాటు తమిళం, మలయాళం, హిందీ, కన్నడ భాషల్లో గ్రాండ్‌గా విడుదల చేయనున్నట్లు మేకర్స్ వెల్లడించారు.

# తండేల్ ప్రచార వీడియో విడుదల




నాగ చైతన్య, సాయి పల్లవి జంటగా నటిస్తున్న 'తండేల్' సినిమా షూటింగ్ జరుగుతున్న సంగతి తెలిసిందే. దీనికి చందూ మొండేటి దర్శకుడు, ఈ సినిమాని గీత ఆర్ట్స్ బ్యానర్ మీద అల్లు అరవింద్ సమర్పిస్తుండగా బన్నీ వాసు నిర్మిస్తున్నారు. చిత్ర నిర్వాహకులు ఈ సినిమా మొదటి ప్రచార వీడియో విడుదల చేశారు. నాగ చైతన్య సముద్రం మీదకి చేపలు పట్టడానికి వెళితే, తప్పిపోయి పాకిస్తాన్ దేశానికి వెళ్లి అక్కడ సైనికులకు దొరికిపోతాడు. అక్కడ పాకిస్తాన్ జైల్లో నాగ చైతన్య ఉంటే, ఇక్కడ అతని ప్రియురాలు సాయి పల్లవి సముద్రం ఇవతలి ఒడ్డున అతనికోసం ఎదురుచూస్తూ ఉంటుంది. ఈ ప్రచార చిత్రాలు ప్రతి సన్నివేశం ఆసక్తికరంగా తీయడమే కాకుండా, అవి ఎంతో ఉన్నతమైన సాంకేతికతని కూడా వాడినట్టుగా స్పషంగా తెలుస్తోంది. ఎందుకంటే నాగ చైతన్య సముద్రంలోకి వెళ్లడం, పాకిస్తాన్ సైనికులకు దొరికిపోవడం ఇవన్నీ ఎంతో హృద్యంగా చిత్రీకరించారు. 'తండేల్' కథ నేపథ్యం శ్రీకాకుళం దగ్గర జరిగిన ఒక కథ ఆధారంగా తీసుకొని నిర్మిస్తున్నారు కాబట్టి, నాగ చైతన్య శ్రీకాకుళం యాస కూడా బాగానే మాట్లాడటం అలవాటు చేసుకున్నాడు. 'దద్దా గుర్తెట్టుకో, ఈపాలి ఏట గురితప్పేదే లేదేస్. ఇక రాజులమ్మ జాతరే' అని మాటతో ప్రారంభం అవుతుంది. దేవి శ్రీ ప్రసాద్ నేపథ్య సంగీతం ఈ చిత్రాలకి మంచి తోడ్పాటు అందించటమే కాకుండా, ఆసక్తికరంగా ఉండేట్టు చేసింది.




# 8న దేవర చిత్రం ఫస్ట్ గ్లింప్స్ విడుదల

ఎన్టీఆర్ హీరోగా నటిస్తున్న చిత్రం 'దేవర' చిత్రానికి సంబంధించి పోస్టర్స్ తప్ప వీడియో గ్లింప్స్ ఏమీ బయటకు రాలేదు. ఇప్పుడు గ్లింప్స్‌కు ముహూర్తం కుదిరింది. ఈ నెల 8న దేవర చిత్రం ఫస్ట్ గ్లింప్స్‌ను వదలనున్నారు మేకర్స్. ఇదే తరుణంలో మరో గుడ్‌న్యూస్ చెప్పింది చిత్ర బృందం. ఆ చిత్రం ఆడియో హక్కుల్ని బాలీవుడ్ దిగ్గజ మ్యూజిక్ సంస్థ టీ-సిరీస్ సొంతం చేసుకుంది. ఈ విషయాన్ని టీ సిరీస్ సంస్థ ట్వీట్ చేసింది. 'దేవర సినిమా ఆడియో రైట్స్ సొంతం చేసుకోవడం గర్వంగా ఉంది. కొరటాల శివ విజన్, అనిరుద్ధ్ మాస్టరింగ్ మ్యూజిక్ సినిమాను మరోస్థాయికి తీసుకెళ్తుంది అనే నమ్మకం ఉందని పేర్కొన్నారు. అయితే భారీ మొత్తంలో చెల్లించి ఈ హక్కుల్ని తీసుకున్నట్లు సమాచారం. ఈ నెల 8న దేవర గ్లింప్స్ విడుదల చేయబోతున్నట్లు నిర్మాణ సంస్థ నూతన సంవత్సరం శుభాకాంక్షలు చెబుతు ఓ పోస్టర్ విడుదల చేసింది. దీంతో ఫ్యాన్స్ అంతా ఈ గ్లింప్స్‌ను ఎప్పుడెప్పుడు చూస్తామా అని ఎదురుచూస్తున్నారు. దీనికి సంబంధించి మరో వార్త కూడా వైరల్ అవుతోంది. గ్లింప్స్‌ను వెండితెరపై చూసే అవకాశం ఉందని సోషల్ మీడియాలో గుసగుసలు వినిపిస్తున్నాయి. సంక్రాంతి పండుగ సందర్భంగా 12న 'గుంటూరు కారం', 'హనుమాన్' సినిమాలు థియేటర్‌లో సందడి చేయనున్నాయి. 'హనుమాన్' సినిమాకి 'దేవర' గ్లింప్స్‌ను అటాచ్ చేయనున్నారట. 'హనుమాన్' మూవీ చూడడం కోసం థియేటర్లకు వచ్చిన ప్రేక్షకుడికి 'దేవర' గ్లింప్స్ డబుల్ ట్రీట్ ఇవ్వనుంది. ఎన్టీఆర్, కొరటాల శివ కాంబినేషన్‌లో వచ్చిన 'జనతా గ్యారేజ్' సూపర్ హిట్ అయింది. తదుపరి శివ తీసిన 'ఆచార్య'తో మొదటి ఫ్లాప్ అందుకున్నారు. అందుకే విజయబాటలో పడాలని తన ఆశలన్నీ 'దేవర'పైనే పెట్టుకున్నారు కొరటాల శివ. ఈ చిత్రంలో ఎన్టీఆర్ సరసన హీరోయిన్‌గా శ్రీదేవి కూతురు జాన్వీ కపూర్ నటిస్తోంది. సైఫ్ అలీఖాన ప్రతినాయకుడిగా నటిస్తున్నారు. అనిరుద్ధ్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. రెండు భాగాలుగా తెరకెక్కుతున్న ఈ చిత్రం మొదటి భాగం ఏప్రిల్ 5న విడుదల కానుంది.

# సంక్రాంతి చుట్టూ సాగే కథ

నా సామిరంగా కథపై అప్పుడే ఊహాగానాలు

నాగార్జున, అల్లరి నరేష్, రాజ్ తరుణ్ నటిస్తున్న 'నా సామిరంగ' సినిమా సంక్రాంతి సందర్భంగా జనవరి 14న విడుదలవుతోంది. విజయ్ బిన్నీ ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఇందులో ఆషిక రంగనాథ్, రుస్కర్ ధిల్లాన్, మిర్న కథానాయికలుగా నటిస్తున్నారు. ఈ సినిమా నుండి ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు, పాటలు ఇప్పటికే బాగా ప్రాచుర్యం పొందాయి. ఈ సినిమాకి ఆస్కార్ విన్నర్ ఎంఎం కీరవాణి సంగీతం సమకూర్చుస్తున్నారు. ఈ సినిమాకి సుమారు రూ. 45 కోట్ల వరకు అయిందని పరిశ్రమలో టాక్ నడుస్తోంది. అందుకే ఈ సినిమాని ఎట్టి పరిస్థితుల్లో సంక్రాంతికి విడుదల చెయ్యాలని అనుకొని, విడుదల చేస్తున్నారు. ఎందుకు ఈ సినిమా సంక్రాంతికి విడుదలవ్వాలని ఈ చిత్ర నిర్వాహకులు పట్టు పట్టారు అంటే, ఈ సినిమా కథా నేపథ్యం అటువంటిది అని అంటున్నారు. ఇకపోతే ఈ సినిమా కథ కొంచెం లీకయింది. ఈ సినిమా కథ మొత్తం మూడు రోజుల్లో జరిగే కథ అని అంటున్నారు. మధ్యలో ఫ్లాష్ బ్యాక్ సన్నివేశాలు తప్పితే ఈ సినిమా కథ భోగి నాడు మొదలై కనుమ నాడు ముగుస్తుంది అని అంటున్నారు. అందుకే ఇది సంక్రాంతి పండగ నేపథ్యం వున్న కథ అని అందుకే సంక్రాంతికి విడుదలైతేనే బాగుంటుందని చిత్ర నిర్వాహకులు రాత్రి పగలు పని చేసి సినిమాని పూర్తి చేసినట్టుగా తెలుస్తోంది. భోగి నాడు ఏమి జరిగింది, దానివల్ల ఎదురయ్యే సంఘటనలు ఏంటి, మళ్ళీ కనుమ నాడు ఈ కథ ఎలా పూర్తయింది అనేదే సినిమా అని



అంటున్నారు. ఈ సినిమాకి చిట్టూరి శ్రీనివాస్ నిర్మాత. నాగ్ చాలా రోజుల తర్వాత నటిస్తున్న పూర్తిస్థాయి మాస్ ఎంటర్‌టైనర్ 'నా సామిరంగ'. అల్లరి నరేష్, రాజ్ తరుణ్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. సంక్రాంతి కానుకగా ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకురానుంది.

ఇప్పటికే ఈ సినిమా నుంచి గ్లింప్స్‌తో పాటు ఫస్ట్ సింగిల్, అల్లరి నరేష్ ఇంట్రోను చిత్రబృందం విడుదల చేయగా ప్రేక్షకుల నుంచి మంచి రెస్పాన్స్ వచ్చింది.